క్లుప్తంగా

ప్రశాంతంగా ఐసెట్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కాకినాడ డిజిటల్ అయాన్ కేంద్రంలో ఐసెట్–23 పరీక్ష బుధవారం ప్రశాంతంగా నిర్వహించారు. ఉదయం నిర్వహించిన పరీక్షకు 520 మందికి గాను 481 మంది హాజరు కాగా మధ్యాహ్నం పరీక్షకు 520కి గాను 485 మంది హాజరయ్యారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ సిటీ: 33/11 కేవీ ఆనందభారతి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి 33 కేవీ ఫీడర్ వార్షిక మరమ్మతుల నిమిత్తం ఈ నెల 26వ తేదీ శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు కాకినాడ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.ప్రసాద్ బుధవారం రాత్రి తెలిపారు. సినిమా రోడ్డు, శేషప్‌గల్లీ, పోలీసు లైన్, బ్యాంక్‌పేట, జయ రెసిడెన్సీ వీధి, శ్రీకాంప్లెక్స్ వీధి, కల్పనా సెంటర్, సత్యప్రసన్ననగర్, రామకృష్ణారావుపేట, కొత్తపేట మార్కెట్, టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఈఈ ప్రసాద్ కోరారు.

స్థానిక ప్రతాప్‌నగర్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. ప్రతాప్‌నగర్ సెంటర్, వేంకటేశ్వర టెంపుల్ వీధి, పుల్లవారి వీధి, వంటిమామిడి జంక్షన్, గాంధీపార్కు ఏరియా, రామారావుపేట సచివాలయం, ప్రకాశం వీధి, నాగేశ్వరరావు వీధి తదితర ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు.

నేడు వలంటీర్లకు వందనం

కరప: తూరంగిలోని ఎస్‌సీవీ ఫంక్షన్ హాలులో గురువారం ఉదయం 9 గంటలకు వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కర్రె స్వప్న తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎంపీపీ పెంకె శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో కరప మండల వలంటీర్లను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సత్కరించి, ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందజేస్తారన్నారు. మండలంలోని గ్రామ వలంటీర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, కార్యదర్శులు హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

ఉద్యోగుల శ్రేయస్సు కోసమే పోరాటం

కాకినాడ సిటీ: రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల శ్రేయస్సు కోసమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నిరంతరం పోరాటం సాగిస్తుందని, దీనికి అన్ని సంఘాలు సహకరించాలని ఏపీజీఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆస్కార రావు అన్నారు. బుధవారం స్థానిక ధర్నా చౌక్ వద్ద ఏపీజీఈఏ ఆధ్వర్యంలో జిల్లా శాఖ దీక్షా శిబిరం నిర్వహించింది. సీపీఎస్ రద్దు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులర్, ప్రతి నెలా 1న వేతనాలు, బకాయిలు తదితర సమస్యలపై ఆయన మాట్లాడారు. ఉద్యోగుల సంఘం నాయకులు జి.శ్రీకాంత్‌రాజు, చెల్లుబాని పాపారావు, ఎం.జగన్నాథం, డి.వీరయ్య, టీవీ రమణ, ఎం.నాగలక్ష్మి, ఎం.జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పనులు పూర్తి చేయండి

కాకినాడ సిటీ: వర్షాలు పడే లోపు పూడికతీత పనులు పూర్తి చేయాలని కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు ఆదేశించారు. బుధవారం ఆయన సూర్యనారాయణపురం రైల్వే డ్రైన్ ప్రాంతంలో పూడికతీత పనులను పరిశీలించారు. యంత్రాల ద్వారా అవకాశం లేని చోట్ల ప్రత్యామ్నాయంగా కార్మికులతో పనులు చేయిస్తున్న విధానంపై ఆరా తీశారు. వర్షాలతో ఏ ఒక్క ప్రాంతంలోనూ నీరు నిలిచిపోకుండా ఉండాలనే లక్ష్యంతో ఈ పనులను మరింత వేగంగా చేపట్టాలని ఆదేశించారు. ఇంజినీరింగ్, పారిశుధ్య విభాగానికి చెందిన అధికారులు సమన్వయంతో పనులను పర్యవేక్షించాలన్నారు. తడి, పొడి చెత్త సేకరణ తీరును పరిశీలించారు. హూపర్ టిప్పర్ వాహనాల ద్వారా చెత్తను విభజించి తరలిస్తున్న విధానాన్ని చూశారు. ప్రజలతో మాట్లాడి పారిశుధ్య కార్మికులు సకాలంలో విధులకు వస్తున్నారో లేదో ఆరా తీశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కుడుపూడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు పరిశుభ్ర జలాలు అందించండి



వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ మహేష్‌కుమార్

కాకినాడ సిటీ: పరిశుభ్రమైన నీటిని ప్రజలకు అందించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ మహేష్‌కుమార్ రవిరాల ఆదేశించారు. స్థానిక స్మార్ట్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. కాలువ నుంచి గోదావరి నీటి విడుదలను నిలిపివేసిన నేపథ్యంలో వేసవి జలాశయాల ద్వారా అందిస్తున్న నీటి నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఈ నీటి నమూనాలను సేకరించి విశాఖపట్నంలోని రీజినల్ ల్యాబ్‌కు తీసుకువెళ్లి నాణ్యతను తెలుసుకోవాలన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాగు చేస్తే పంట సిరులే..

- ఎల్లేటి తూముల తలుపులు శిథిలం
- మరమ్మతులకు రైతుల వినతి



శహపురం డ్రెయిన్‌పై ఎల్లేటి తూముల వద్ద శిథిలమైన ఇనుప తలుపులు

కరప: శహపురం డ్రెయిన్‌పై ఉన్న ఎల్లేటి తూములు (ప్లాపి షెట్టర్లు) శిథిలావస్థకు చేరాయి. దీనివల్ల సారవంతమైన పంట పొలాలు చౌడుగా మారుతున్నాయని రైతులు అంటున్నారు. సముద్రం నుంచి వచ్చే పోటు నీరు డ్రెయిన్‌లోకి రాకుండా అడ్డుకునే ఎల్లేటి తూములు దెబ్బతిన్నా అధికారులు పట్టించుకోవడం లేదంటున్నారు. రెండు మండలాల్లోని పంట పొలాల్లో మురుగు, వర్షం నీరు శహపురం డ్రెయిన్ ద్వారా ప్రవహించి గొర్రిపూడి సమీపంలో తుల్యభాగ డ్రెయిన్‌లో కలుస్తోంది. పెదపూడి మండలం శహపురం, కాండ్రేగుల, కరప మండలం పేపకాయలపాలెం, కరప, వలసపాకల, వేములవాడ, పాతర్లగడ్డ గ్రామాల్లోని పంట పొలాలు శహపురం డ్రెయిన్ పరిధిలోకి వస్తాయి. శహపురం నుంచి గొర్రిపూడి వరకూ ఈ డ్రెయిన్ 8.25 కిలోమీటర్లు ఉంటుంది. సుమారు 2,500 ఎకరాల్లోని మురుగు, ముంపు నీరు ఈ డ్రెయిన్ ద్వారా ప్రవహిస్తుంది. అమావాస్య సమయంలో సముద్రం నుంచి వచ్చే పోటు నీరు శహపురం డ్రెయిన్‌లోకి రాకుండా ఉండేందుకు గొర్రిపూడి వద్ద ఐదు తూములకు ప్లాపి షెట్టర్లు (నీటి ప్రవాహాన్ని బట్టి వాటంతట అవే తెరుచుకుని మూసుకుని పోయే తలుపులు) బ్రిటీష్ కాలంలో ఏర్పాటు చేశారు. వాటినే రైతులు ఎల్లేటి తూములుగా పిలుస్తున్నారు. ఐదు కానాలుగా విభజించి వాటికి షెట్టర్లు అమర్చి పైనుంచి రహదారి కోసం వంతెన నిర్మించారు. శహపురం డ్రెయిన్‌లో నీటి ప్రవాహం ఎక్కువగా వస్తున్నప్పుడు ఈ షెట్టర్లు ఆటోమేటిక్‌గా తెరుచుకుని తుల్యభాగ డ్రెయిన్‌లో కలిసి పటవల వద్ద సముద్రంలో కలుస్తున్నాయి. అమావాస్య సమయంలో సముద్రం పోటు నీరు ప్రవాహానికి ఈ షెట్టర్లు మూసుకుపోయి నీటిని కాలువలోకి రాకుండా చేస్తాయి.

అయితే వీటి ఇనుప తలుపులు తుప్పు పట్టి పూర్తిగా శిథిలమయ్యాయి. దీంతో పోటు నీరు డ్రెయిన్‌లోకి వచ్చి చేరుతోంది. ఈ నీటితో కరప, వలసపాకల, వేములవాడ, పాతర్లగడ్డ గ్రామాలకు సంబంధించి సుమారు 1,500 ఎకరాలు ఉప్పుకయ్యలుగా మారుతున్నాయని పలువురు రైతులు అంటున్నారు. కాలువల ఆధునీకరణ పనుల్లో భాగంగా శహపురం డ్రెయిన్‌పై ఉన్న ఎల్లేటి తూములను బాగుచేయించి, కొత్త తలుపులు అమర్చాలని రైతులు కోరుతున్నారు.

తూములు ధ్వంసం



శహపురం డ్రెయిన్‌పై ఉండే ఎల్లేటి తూములు పూర్తిగా ధ్వంసమయ్యాయి. సముద్రం పోటునీరు పంట పొలాల్లోకి చేరడంతో సారవంతమైన భూములు చౌడుబారిపోతున్నాయి. దీనివల్ల దిగుబడులు తగ్గి నష్టపోతున్నాం. రైతుల ఇబ్బందులను గమనించి ఎల్లేటి తూముల బాగుకు చర్యలు తీసుకోవాలి.

– నక్కా వీరభద్రరావు, రైతు, వలసపాకల

కొత్త తలుపులు అమర్చాలి



తుల్యభాగ డ్రెయిన్‌లో కలిసే శహపురం డ్రెయిన్‌పై ఉండే ఎల్లేటి తూములకు ఉండే ఇనుప తలుపులు పాడైపోవడంతో పంటలు పండక నష్టపోతున్నాం. అధికారులు స్పందించి ఎల్లేటి తూములకు కొత్త ఇనుప తలుపు అమర్చేందుకు చర్యలు తీసుకోవాలి.

– బందే వీరబాబు, రైతు, వేములవాడ

క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి



వేళంగిలో మొదటి రోజు విజేత జట్టుకు మెమెంటో అందజేస్తున్న డాక్టర్ అన్నవరం

కరప: యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని వైఎస్సార్ సీపీ నాయకుడు, రమ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పితాని అన్నవరం అన్నారు. వేళంగి హైస్కూల్ గ్రౌండ్‌లో బుధవారం వేళంగి గ్రాడ్యుయేట్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పిల్లి వీరబాబుతో కలసి ప్రారంభించారు. ఈ టోర్నమెంట్ అండర్–19, నో ఏజ్ లిమిట్ విభాగాలలో జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. తొలిరోజు అండర్–19 విభాగంలో గురజనాపల్లి జట్టుపై వాకాడ జట్టు విజయం సాధించింది. నో ఏజ్ లిమిట్ టోర్నమెంట్‌లో సిరిపురం జట్టుపై వాకాడ జట్టు, వేళంగి మార్కెట్ జట్టుపై కరప జైభీమ్ యూత్ జట్టు విజయం సాధించాయి. విజేతలకు డాక్టర్ పితాని అన్నవరం మెమెంటోలు అందజేశారు. వేళంగి గాడ్యుయేట్ యూత్ ప్రతినిధులు డేగల శ్రీనివాస్, అప్పికొండ దుర్గాప్రసాద్, చప్పిడి మూర్తి, విక్రమ్, చిట్టూరి అప్పన్న, నక్కెళ్ల వేణు పాల్గొన్నారు.

వలంటీర్లు సంక్షేమ వారధులు



ఇంద్రపాలెంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు



కార్యక్రమంలో పాల్గొన్న వలంటీర్లు

- దేశానికే ఆదర్శంగా వ్యవస్థ
- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: వెలకట్టలేని సేవలతో ప్రభుత్వానికి అండగా ఉంటూ సంక్షేమ వారధులుగా వలంటీర్లు నిలుస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. ఇంద్రపాలెం గ్రామంలోని పిల్లి అనంతలక్ష్మి కల్యాణ మండపంలో బుధవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వలంటీర్లను ఎమ్మెల్యే సన్మానించారు. ఇంద్రపాలెం, చీడిగ, కొవ్వాడ, గంగనాపల్లి, కొవ్వూరు, రేపూరు, తూరంగి తదితర గ్రామాల్లోని 376 మంది వలంటీర్లను సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలతో సత్కరించి సర్టిఫికెట్లు, బ్యాడ్జీలు, ప్రోత్సాహకం అందించారు. తొలుత కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ దేశానికే ఆదర్శంగా వలంటీర్ వ్యవస్థ ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు సకాలంలో సేవలను అందించాలనే లక్ష్యంతో వలంటీర్ వ్యవస్థకు శ్రీకారం చుట్టారన్నారు. నేడు ఎంతో మంది వృద్ధులు, మంచాన పట్టిన అవ్వా తాతలు, రోగులు ప్రతి నెలా ఒకటో తేదీనే క్రమం తప్పకుండా పింఛన్ సొమ్ము తీసుకోగలుతున్నారన్నారు. ఒక్క పింఛనే కాదు అన్నిరకాల సంక్షేమ పథకాలు వర్తింపజేసేందుకు లబ్ధిదారులకు అండగా ఉంటూ సచివాలయ సిబ్బందితో సమన్వయంతో ముందుకు సాగుతున్నారన్నారు. వీరందరికీ ప్రభుత్వం తరఫున సన్మానాలు చేస్తూ గౌరవం కల్పిస్తున్నామన్నారు. ఏడాదిలో ఎన్నికలు వస్తున్నాయని, మరోసారి అధికారంలోకి రానున్న జగనన్న ప్రభుత్వంలో వలంటీర్లకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఇంద్రపాలెం గ్రామ నాయకుడు, ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, సర్పంచులు రామదేవు సూర్యప్రకాశరావు, పిల్లి చక్రరావు, నక్కా వీరన్న, మండల సచివాలయాల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గీసాల శ్రీనివాస్, కొప్పిశెట్టి గణేష్, దూనబోయిన అరుణ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి



విద్యార్థులతో డీఈవో అన్నపూర్ణ తదితరులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలని జిల్లా విద్యాశాఖాధికారి కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ అన్నారు. బుధవారం వీబీవీఆర్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎంఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న వేసవి వినోదం ముగింపు వేడుకలలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివి గొప్ప శాస్త్రవేత్తలుగా, ఇంజినీర్లుగా, డాక్టర్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. కాకినాడ డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి ఆర్‌జే డేనియల్ రాజు మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశలకు అనుగుణంగా పిల్లలు చదువుకోవాలన్నారు. విద్యార్థులు మానసిక ధైర్యంతో ముందుకు సాగితే ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనే తత్వం అలవడుతుందన్నారు. బాలవేదిక కన్వీనర్ నోరి బలరామకృష్ణ మాట్లాడుతూ మారుతున్న సామాజిక, ఆర్థిక పరిస్థితులపై అవగాహన పెంచుకోవాలన్నారు. వేసవి వినోదం కన్వీనర్ కేసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమం నిర్వహణకు సహకరించిన వీబీవీఆర్ చారిటబుల్ ఫౌండేషన్ అధ్యక్షుడు కె.సత్యనారాయణకు ధన్యవాదాలు తెలిపారు. ఇందులో 27 పాఠశాల నుంచి 128 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ లిటరరీ చైర్మన్ పీవీ సుబ్బారావు, శిక్షకుడు పిల్లి గోవిందరాజులు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.అమరేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థోపెడిక్స్ హెచ్‌వోడీగా డాక్టర్ విఠల్



హెచ్‌వోడీగా బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ విఠల్

కాకినాడ క్రైం: స్థానిక రంగరాయ వైద్య కళాశాల ఆర్థోపెడిక్స్ విభాగాధిపతి (హెచ్‌వోడీ)గా డాక్టర్ ఎంపీఆర్ విఠల్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆర్ఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం బుధవారం ఉత్తర్వులిచ్చారు. 1982–87 మధ్య కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చదివిన డాక్టర్ విఠల్, ఇక్కడే 1990–93 మధ్య ఎముకల వైద్య విభాగంలో పీజీ పూర్తి చేశారు. 1997లో తుని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా ప్రభుత్వ ఉద్యోగం పొందారు. 1998–2012 మధ్య ఆర్ఎంసీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, 2016 వరకు విజయవాడ సిద్ధార్థ మెడికల్ కాలేజీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. 2017 నుంచి విశాఖపట్టణం ఆర్‌సీడీ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా కొనసాగుతున్న డాక్టర్ విఠల్ సోమవారం కాకినాడ ఆర్ఎంసీకి బదిలీపై వచ్చారు. సీనియారిటీ ఆధారంగా ఆయనకు విభాగాధిపతి (హెచ్‌వోడీ)గా బాధ్యతలు అప్పగిస్తూ ఆర్ఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ నరసింహం నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి.

కల్యాణం... వైభోగం



టౌన్‌హాల్ ఎదురుగా సీతారామస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

బోట్‌క్లబ్: స్థానిక భానుగుడి సెంటర్‌లో ఉన్న ఉషారాజరాజేశ్వరీ సమేత భానులింగేశ్వరస్వామి వార్షిక కల్యాణం బుధవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. ఉదయం ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. రాత్రి కల్యాణాన్ని ఎంతో వైభవంగా జరిపారు. ఆలయ కమిటీ చైర్మన్ వాకాడ సత్తిబాబు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈఓ ఎం.మురళీ వీరభద్రరావు ఏర్పాట్లు చేశారు. కల్యాణం అనంతరం స్వామివారి ప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు కర్రి బుచ్చిరెడ్డి, ఎన్‌వీ సాయిబాబా, రామ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక మెయిన్‌రోడ్డులోని టౌన్‌హాల్ ఎదురుగా ఉన్న సీతారామస్వామి ఆలయంలో స్వామి కల్యాణం జరిగింది. ఆలయ అర్చకుడు పాణింగపల్లి మాధవాచార్యులు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. ఆలయ ఈఓ బీవీఆర్ చౌదరి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: జిల్లాలోని పరిశ్రమల్లో భద్రతతో పాటు కాలుష్య నియంత్రణ చర్యలు పాటించేలా అధికారులు పటిష్ట పర్యవేక్షణ కొనసాగించాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ కోర్టు హాలులో జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. పరిశ్రమలు, ఏపీపీసీబీ, గ్రౌండ్ వాటర్, రవాణా, అగ్నిమాపక, పంచాయతీ, ఫ్యాక్టరీస్, పొల్యూషన్ తదితర శాఖల అధికారులు హాజరయ్యారు. తొలుత గత సమావేశంలో తీర్మానించిన అంశాలకు సంబంధించి తీసుకున్న చర్యలపై చర్చించారు. పరిశ్రమల్లో భద్రతతో పాటు పారిశ్రామిక కార్యకలాపాలతో పర్యావరణం కలుషితం కాకుండా జలవనరులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. అవసరమైన చోట సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు (ఎస్‌టీపీ) ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పారిశ్రామిక యూనిట్లకు సత్వర అనుమతుల జారీకి అమలులో ఉన్న ఏపీ సింగిల్ డెస్క్ విధానం కింద 2023, ఏప్రిల్ 11 నుంచి ఈనెల 22 వరకు 53 దరఖాస్తులకు గాను వివిధ శాఖల పరిధిలో 35 దరఖాస్తులు ఆమోదం పొందినట్లు వివరించారు. మిగిలిన దరఖాస్తులను నిర్దిష్ట ఎస్ఎల్ఏ గడువులోగా పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమలకు సంబంధించి పారిశ్రామిక అభివృద్ధి విధానాలు (2015–20, 2020–23), వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం పథకం పరిధిలో 25 యూనిట్లకు ప్రోత్సాహకాల కింద రూ.2.53 కోట్లు మంజూరు చేశారన్నారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం టి.మురళి, ఏడీ కె.కృష్ణారావు, ఎల్‌డీఎం సీహెచ్ఎస్‌వీ ప్రసాద్, డీపీవో ఆర్.విక్టర్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డి.రాధాకృష్ణ, ట్రాన్స్‌పోర్టు అధికారి పీవీ సాయిప్రసాద్ తదితరులు హాజరయ్యారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సమీక్ష

కాకినాడ సిటీ: సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. స్థానిక కలెక్టరేట్ కోర్టు హాలులో ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో జిల్లాలో పురోగతిపై వివిధ శాఖ అధికారులతో సమీక్షించారు. చిన్నారులు, కిశోర బాలికలు, గర్భిణుల ఆరోగ్య పరీక్షలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. గర్భిణుల ఆరోగ్యం, పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు, రక్తహీనత పరీక్షలు, సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు తదితరాలపై కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.

సెంట్రల్ జైలు ఖైదీ మృతి

కాకినాడ క్రైం: రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న రిమాండ్ ఖైదీ అనారోగ్యంతో చికిత్స పొందుతూ కాకినాడ జీజీహెచ్‌లో మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. విజయనగరం జిల్లా రాజాం మండలం మెంటిపేట గ్రామానికి చెందిన పడాల హరి (63)కి సివిల్ వివాదంలో జైలుశిక్ష పడగా, ఈ నెల 12వ తేదీన రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తీసుకువచ్చారు. అయితే ఈనెల 15న మధుమేహం, రక్తపోటుతో తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం 17న జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై బుధవారం రాత్రి స్థానిక వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

క్రీడాకారిణికి ఆర్థిక సాయం



క్రీడాకారిణికి ఆర్థిక సాయం అందిస్తున్న రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్: థాయ్‌లాండ్‌లో ఈ నెల 27న జరిగే అంతర్జాతీయ రైఫిల్ షూటింగ్ పోటీల్లో పాల్గొనున్న కాకినాడ క్రీడాకారిణి దంగేటి వర్షిణి నాగమహాలక్ష్మికి రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ ఆర్థిక సహాయం అందించింది. జేఎన్‌టీయూకేలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న వర్షిణి తనకు ఆర్థిక సహాయం చేయాలని క్లబ్ సభ్యులను కోరగా బుధవారం రూ.20 వేలను క్లబ్ అధ్యక్షుడు జీవీ కృష్ణప్రకాష్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు క్లబ్ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. క్రీడాకారిణికి ముంజులూరి విశ్వేశ్వరరావు, డాక్టర్ రామకృష్ణ, ఉదయభాను, పట్టాభి, లంక సాయిబాబు, మాజేటి పవన్‌లు సాయం అందించినట్లు చెప్పారు. క్లబ్ కార్యదర్శి వడ్డాది ఆదిత్య పాల్గొన్నారు.

ప్రణాళికతో ముందుకు సాగాలి

కాకినాడ సిటీ: నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకంలో గృహ నిర్మాణాలకు సంబంధించి అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలని కాకినాడ నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు అన్నారు. బుధవారం గృహ నిర్మాణ సంస్థ సంచాలకుడు సుధాకర్ పట్నాయక్‌తో కలసి నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. కొమరిగిరి లేఅవుట్‌లో వివిధ దశలు పూర్తి చేసుకున్న ఇళ్ల లబ్ధిదారుల వాటాను చెల్లించే విధంగా సమాయత్తం చేయాలన్నారు. జియో ట్యాగింగ్ ప్రక్రియ ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. నగదు చెల్లింపుల్లో జాప్యం లేకుండా చూడాలన్నారు. సమావేశంలో కార్యదర్శి ఎం.ఏసుబాబు, డీఈ సత్యనారాయణరెడ్డి, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టీపీఆర్వో మానే కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సోదరుల దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ శిరీష

కాకినాడ రూరల్: స్థానిక సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జాతీయ సోదరుల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మికవేత్త డాక్టర్ శిరీష మాట్లాడుతూ భగవంతుడిచ్చిన గొప్పవరం తోబుట్టువులు అని అన్నారు. అన్నదమ్ముల మధ్య బంధం అపూర్వమన్నారు. మన జీవితంలో సోదరుల స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరన్నారు. అడబాల రత్నప్రసాద్, రాఘవరావు, రెడ్నం రాజా తదితరులు పాల్గొన్నారు.

వివిధ పోస్టులకు ఇంటర్వ్యూలు

కాకినాడ క్రైం: డీఎంఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం ఆదేశాల మేరకు రంగరాయ వైద్య కళాశాలలోని పలు కీలక విభాగాలలో సీనియర్ రెసిడెంట్ల నియామకానికి వాకిన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉండి, అర్హులైన పీజీ విద్యార్థులు ఈ నెల 26న ఉదయం 11 గంటలకు కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో నిర్వహించే వాకిన్ ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు ఆర్ఎంసీకాకినాడ.కాం వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

మహిళ అదృశ్యం

కరప: ఓ మహిళ అదృశ్యంపై కేసు నమోదైంది. కరప పోలీసుల కథనం మేరకు.. నడకుదురు గ్రామానికి చెందిన గడాడ పద్మారావు కుమార్తె మనీషా తాళ్లరేవులోని అపెక్స్ ఫ్రాన్స్ కంపెనీలో పనిచేస్తోంది. ఈ నెల 23న పని చేసేందుకు కంపెనీకి వెళ్లింది. అదేరోజు మధ్యాహ్నం 12.30 గంటలకు స్నేహితులతో కలసి బయటకు వెళ్లినట్లు ఇంటికి ఫోన్‌చేసి చెప్పింది. అప్పటి నుంచి ఆమెకు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వస్తుంది. ఈ మేరకు ఆమె సోదరుడు గడాడ అప్పాజీ బుధవారం రాత్రి కరప పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆరుగురికి కారుణ్య నియామకాలు

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా వివిధ కారణాలతో మరణించిన ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కలెక్టర్ కృతికా శుక్లా బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఖాళీల సంఖ్య, రోస్టర్, సీనియారిటీ ప్రకారం అభ్యర్థులకు పోస్టింగ్స్ ఇచ్చామని తెలిపారు. నలుగురిని జూనియర్ అసిస్టెంట్లుగా, ఇద్దరిని ఆఫీస్ సబార్డినేట్లుగా నియమించామన్నారు. కొత్తగా ఉద్యోగం పొందిన వారు చిత్తశుద్ధి, అంకిత భావంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి జీఎస్ఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సేవలు ఎనలేనివి

కాకినాడ సిటీ: సమాజానికి జర్నలిస్టులు అందిస్తున్న సేవలు ఎనలేనివని కాకినాడ మూడో అదనపు జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొల్ల ఆదిత్యకుమార్ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో రాగిరెడ్డి వెంకట జయరామ్‌కుమార్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో కాకినాడ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ప్రజలకు మజ్జిగ పంపిణీ చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ చలివేంద్రానికి జర్నలిస్ట్ అంజిబాబు వెయ్యి గ్లాసులను అందజేశారు. జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మంగా వెంకటశివరామకృష్ణ, న్యాయవాది గుత్తుల సమీర్, క్రాఫ్ట్ టీచర్ రమణి, వ్యాపారవేత్తలు తలాటం స్వామినాయుడు, ఎస్ఎస్ మోహన్, వి.సత్యనారాయణ పాల్గొన్నారు.